క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నారాయణపేట: యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి సూచించారు. భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా ' డ్రగ్స్ నుంచి యువతను కాపాడుకుందాం.. నవభారతాన్ని నిర్మించుకుందాం' అనే పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. చదువులు పూర్తయిన తర్వాత యువత భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డ్రగ్స్, మత్తు పదార్థాల వైపు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, సల్ల వెంకటేష్, వై.సంతోష్, శివరాజ్, నర్సింహనాయుడు, అశోక్, ఎం.సంతోష్, నందుకుమార్, నర్సింహ, శ్రీనివాస్, జేకే.అనిల్, నాగురావు, చామకూర నగేష్, రాజప్ప గౌడ్, హరికృష్ణ ప్రభూజీ, రాజు, రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



మక్తల్: పట్టణంలోని యల్లమ్మకుంట కాలనీల్లో జ్యోతిరావ్ పూలే గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యానికి సహకరించే కూరగాయలు, పండ్లు, ఆహారం తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ప్రతి నెలలో ఉచితంగా కంటి శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అంజన్‌ప్రసపాద్, కోశాధికారి సత్యనారాయణ, జోన్ చైర్మన్ జైపాల్‌రెడ్డి , పృథ్వీరాజ్, అంబదాస్, రమేస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మరికల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మరికల్ గ్రంథాలయ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మరికల్ ఖండ సభ్యుడు రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న 'పేట' రోడ్డు



మరికల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరికల్-నారాయణపేట రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షపునీరు వెళ్లడానికి కల్వర్టు నిర్మాణం చేయకపోవడంతో వరద రోడ్డుపై నుంచి పారడంతో గుంతలు ఏర్పడి వాహనల రాకపోకాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడటంతో వాహనదారులకు తీవ్రగాయాలైన ఘటనలు ఉన్నాయి. ఇదే రహదారిపై ఎమ్మెల్యే, కలెక్టర్, పలు శాఖల అధికారులు తిరుగుతున్న ఈ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కుంగిన దారి

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట వ్యవసాయ పొల్లాలకు వెళ్లే ప్రధాన రహదారి వర్షాలకు కుంగిపోవడంతో రైతులు ఆచితూచీ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకే దగ్గర నాలుగు భారీ గొయ్యిలు ఏర్పడడంతో బైక్‌లపై రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే రైతులకు ప్రమాదం పొంచి ఉంది. దాదాపు పది అడుగుల లోతు గొయ్యిలు ఏర్పడటం వల్ల రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి స్పందించి రహదారికి మరమ్మతు చేయించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.



గుంతల రోడ్లు.. తప్పని అవస్థలు

- ప్రమాదకరంగా మారిన రహదారులు
- జంగిల్ కటింగ్ చేపట్టని అధికారులు
- జాడలేని గ్యాంగ్‌మెన్



మొదెళ్ల వాగు కల్వర్టు సమీపంలో గుంతలు పడిన రోడ్డు



క్యాతన్‌పల్లి వద్ద అధ్వానంగా తయారైన రోడ్డు

దామరగిద్ద: మండలంలోని పలు ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. జంగిల్ కటింగ్‌తో పాటు వర్షపు నీటితో ఏర్పడిన గుంతలను పూడ్చకపోవడంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అసలే వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్లకు ఇరువైపు ముళ్ల పొదలు ఏపుగా పెరిగి రహదారులను కమ్మేశాయి. అలాగే పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో పాటు ఇసుక మేటలు వేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండల కేంద్రం నుంచి మద్దూర్ వెళ్లే రోడ్డుపై క్యాతన్‌పల్లి చెరువు కట్ట సమీపంలో ఇసుక మేటలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దామరగిద్ద నుంచి నారాయణపేట వరకు 10 కిలోమీటర్లు, దామరగిద్ద నుంచి కర్ణాటక అంతరాష్ట్ర రహదారి అయిన యానుగుంది వరకు పలు చోట్ల రోడ్లపై గుంతలు, మలపుల దగ్గర ముళ్లపొదలతో తరుచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం..

ఏటా రోడ్ల నిర్వహణ చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిదులు కేటాయింపు లేదంటూ పట్టించుకోక పోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు, ముళ్లపొదలు రోడ్డును కమ్మేశాయి. దీంతో రహదారులు ఇరుకుగా మారి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, తప్పించే క్రమంలో వాహనదారులకు ముళ్ల కంప తగిలి గాయాలవుతున్నాయి. కాన్‌కుర్తి నుంచి మల్‌రెడ్డిపల్లి మీదుగా లోకూర్తి వెళ్లే దారిలో కాన్‌కుర్తి శివారులో మురికితుమ్మ చెట్లు రోడ్డుపైకి వాలడంతో రోడ్డు ఇరుకుగా తయారైంది. అలాగే పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

"రోడ్లకు మరమ్మతు చేపడతాం



దామరగిద్దలో గుంతలు పడిన రోడ్లకు త్వరలోనే మరమ్మతు చేపడతాం. ఇటీవల అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో కల్వర్టు దగ్గర రోడ్డుకు మరమ్మతు చేపట్టాం. వర్షాకాలం కావడంతో రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఆక్రమించిన మాట వాస్తవమే. జంగిల్ కటింగ్‌కు గ్యాంగ్ మెన్‌లు లేరు. మిషనరీ ద్వారా జంగిల్ కటింగ్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

–రాములు,
డీఈ ఆర్‌అండ్‌బీ, నారాయణపేట

వైభవంగా ఆంజనేయస్వామి ఉత్సవాలు



అప్పంపల్లిలో ఆంజనేయస్వామికి మొక్కుతున్న గ్రామస్తులు



సామాన్‌పల్లిలో జల్దిబిందెతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మరికల్: మండలంలోని అప్పంపల్లి, పస్పుల గ్రామాల్లో శనివారం ఆంజనేయస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా జల్దిబిందె తీసుకొచ్చి ఆంజనేయస్వామి విగ్రహాలకు జల, పంచామృతభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామస్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి అఖండ భజనాలు చేశారు.

ఆంజనేయస్వామికి పుష్కర స్నానం

మక్తల్: మండలంలోని సామాన్‌పల్లి గ్రామంలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం శ్రీ ఆంజనేయస్వామికి కృష్ణానది నుంచి పుష్కర నీటిని జల్దిబిందెతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆంజనేయస్వామికి పుష్కర స్నానం చేయించారు. భక్తులు కోలాటం, భజనల మధ్య ఊరేగింపు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తిరుమలస్వామి జల్ది మహోత్సవం

కొత్తపల్లి: మండల పరిధిలోని అల్లీపూర్ తిరుమల స్వామి జల్ది మహోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. శ్రావణ మాస మూడో శనివారాన్ని పురస్కరించుకొని అల్లీపూర్ శివారులో వెలసిన తిరుమల స్వామికి జల్ది బిందె, పల్లకి సేవ నిర్వహించారు. అలాగే అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంజనేయస్వామికి అభిషేకం

కోస్గి రూరల్: శ్రావణమాసంలోని ఆఖరి శనివారం నిర్వహించే పాతర్లగడ్డ ఆంజనేయస్వామి జాతరను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ పూజారి రఘునందన్‌శర్మ అన్నారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం , పూజ కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ అనుబంధ గ్రామమైన సంపల్లి పట్టణంలోని మూన్నుర్‌వాడ, బహర్‌పేట్ , వినాయకనగర్ వీధుల నుంచి ఎడ్ల బండ్లను వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. ఆలయ సమీపంలో యువకులు భక్తులను అన్నదానం చేపట్టారు.

అలుగు పారిన ధన్వాడ పెద్దచెరువు



ధన్వాడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షలకు ధన్వాడ మండలంలోని అన్ని చెరువులు నిండుకుండలా మారాయి. ధన్వాడ పెద్ద చెరువు శనివారం అలుగు పారింది. పాతపల్లి వెళ్లే దారిలో కల్వర్టుపై నుంచి నీరు పారుతుండటంతో ప్రయాణికులు జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు, అధికారులు సూచించారు. ఇంక రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు, రైతులు అప్రమతంగా ఉండాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కనకాద్రి జాతర



దర్శనానికి వెళ్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్ పంచాయతీ నెమళ్లపల్లి గుట్టపై వెలిసిన శ్రీ కనకాద్రి లక్ష్మినర్సింహా స్వామి జాతర ఘనంగా జరిగింది. శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం పల్లకిసేవ, జల్దిబిందె, అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పుష్కరిణిలో స్నానం చేసి మడితో వంటలు చేసి స్వామి వారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోటకొండ పీహెచ్‌సీ ఆద్వర్యంలో ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయగా వైద్యులు డాక్టర్ విరోజా, శృతి, మంజూర్ పాల్గొన్నారు.

- నారాయణపేటలోని భైరంకొండ గ్రామంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భైరప్ప జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టపై వెలిసిన స్వామివారికి గ్రామంలో నుంచి జల్దిబిందెను తీసుకెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామ పురవీధుల గుండా శోభయాత్రగా ఆలయానికి తీసుకెళ్లారు. పెద్దఎత్తున హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో శ్మశాన వాటికకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో శనివారం రోడ్డు నిర్మాణం చేపట్టారు. శ్మశానవాటికకు వెళ్లే దారి మొత్తం పూర్తిగా నీటితో, బురదతో కూరుకుపోవడంతో ప్రజలు తమ కుటుంబీకుల అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో సమస్యను మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిధులు మంజూరు చేశారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ లక్ష్మినారాయణ ముళ్ల కంపను తొలగించి, మొరంను వేయించి రోడ్డును చదును చేశారు. దీంతో ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌ఐ రాజు, పీడీఎస్‌యూ నాయకులు

దామరగిద్ద: సమాజాన్ని యువతను పట్టిపీడిస్తున్న సమస్యల్లో డ్రగ్స్ ప్రధానమైనందని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్‌ఐ రాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, కోశాధికారి మధు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందితో వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారం లాంటి తమ జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు కన్నవారిని కూడా చీకట్లోకి నెట్టుతున్నారన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి మనందరం పాటుపడుదామని కోరారు. కార్యక్రమంలో మధు, కృష్ణ, రైతుసంఘం జిల్లా నాయకుడు తాయప్ప, నరసింహా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



నారాయణపేట రూరల్ : కృష్ణాష్టమి వేడుకలతో పాటు రాబోయే గణేష్ దసరా నవరాత్రుల ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఉదయం చౌక్ బజార్ మిత్రమండలి ఆధ్వర్యంలో సెంటర్ చౌరస్తాలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహానికి పూజలు నిర్వహించారు. చౌక్ బజార్ మిత్రమండలి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

సంపులో పడి బాలుడి మృతి

నారాయణపేట రూరల్: కృష్ణాష్టమి రోజే ఇందిరమ్మ ఇంటి గుంతలో పడి బాలుడి చనిపోయిన విషాధకర ఘటన నారాయణపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భైరంకొండ గ్రామానికి చెందిన వర్షిత, తిమ్మప్పకు ఇద్దరు సంతానం. మొదటి కుమారుడైన ఆర్యన్ (రెండున్నర ఏళ్లు)ను ముద్దుగా కన్నయ్య అని చిన్ని కృష్ణుడి పేరుతో పిలుచుకునే వారు. బాలుడు రోజు లాగే శనివారం మధ్యాహ్నం ఆడుకుంటూ ఇంటి బయటకి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి అనుమానం వచ్చి వారి ఇంటి పక్కనే కుర్వ భీమప్పకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో సంప్ తవ్వారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అది వాన నీటితో నిండిపోయింది. అందులో పడి ఉంటాడనే అనుమానంతో కర్ర సాయంతో సంపులో వెతకగా బాలుడి మృతదేహం కనిపించింది. వెంటనే నారాయణపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కన్నవారి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఇన్‌చార్జి వార్డెన్‌గా బాధ్యతలు

ఊట్కూరు: పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో శనివారం ఇన్‌చార్జి వార్డెన్‌గా ఎస్ వెంకటేశం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి ఈనెల 13న మద్యం తాగి విధులకు హాజరు కావడమే కాకుండా విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అయనను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఎస్సీ హాస్టల్ మద్దూరులో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



దామరగిద్దలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



భైరంకొండలో గోపికల వేషధారణలో విద్యార్థినులు



మరికల్‌లో ఉట్లు కొడుతున్న యువకులు

సాక్షి నెట్‌వర్క్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడి, గోపికలు వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

- నారాయణపేటలో శ్రీకృష్ణ పరమాత్ముడి జన్మదినం సందర్భంగా తల్లులు తమ పిల్లలకు చిన్ని కృష్ణుడి వేషధారణలతో అలంకరించారు. ఉట్టి కొట్టి సందడి చేశారు.
- కృష్ణా మండలం గుడెబల్లూర్‌లోని ఓ పాఠశాల విద్యార్థులు గోపికలుగా, కృష్ణునిగా అలంకరించుకొని కోలాటం ఆడుతూ గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం పాల ఉట్టిని పగల కొట్టారు.
- ఊట్కూరులో విద్యార్థులు గ్రామ పురవీధుల్లో శోభయాత్ర చేపట్టి శివాజీ నగర్, పంచ్ మసీద్, మేయిన్ బజార్ ప్రాంతాల్లో ఉట్లను కొట్టారు. పెద్దజట్రం యూపీఎస్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.
- ధన్వాడ మందిపల్లితండాలోని శ్రీకృష్ణ దేవాలయంలో తండావాసులు జన్మష్టమి ఉత్సవాల్లో భగంగ గ్రామ శివారులో ఉన్న బావి నుంచి నీరు తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు.
- దామరగిద్దలో స్థానిక శివాజీ చౌరస్తాలో ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులు చేపట్టిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది.
- మరికల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా పల్లకి సేవ నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో యువకులు పాలవుట్లను కొట్టారు.
- మాగనూర్‌లో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే వేడుక నిర్వహించారు.



గుడెబల్లూర్‌లో నృత్యం చేస్తున్న బాలికలు

బలవంతపు భూసేకరణ ఆపాలి



రిలే దీక్షలో మాట్లాడుతున్న ధర్మరాజు గౌడ్

నారాయణపేట: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి బలవంతపు భూసేకరణ ఆపాలని భూనిర్వాసితుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందే దాక ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. తరతరాలుగా అనుభవిస్తున్న భూమిని అతి చౌకగా మాయమాటలు చెప్పి లాక్కోవడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రజా పరిపాలన అంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమను మోసం చేయడం దారుణమన్నారు. భూములకు నీళ్లు వస్తున్నా రైతులు ఎంత ఆనందంగా ఉంటారో అంతే స్థాయిలో భూనిర్వాసితులు ఆనందంగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి , జిల్లా అధ్యక్షుడు మశ్చందర్ సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్ రామ్ , నాయకులు సింగారం హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మల్లెపల్లి వాగును పరిశీలించిన అధికారులు



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి గ్రామ సమీపంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మల్లేపల్లి, సోమేశ్వరబండ, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో గ్రామ శివారులోని వాగును తహసీల్దార్ చింతరవి, ఎస్‌ఐ రమేశ్‌లు పరిశీలించారు. గ్రామస్తులు ట్రాక్టర్ల సహాయంతో రాకపోకలు కొనసాగిస్తున్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం

ఊట్కూరు: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందామని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంగలి రాములు అన్నారు. శనివారం ఊట్కూరులో వీహెచ్‌పీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కాషాయ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, లోకకళ్యాణం, హిందూవులను ధర్మం పట్ల జాగ్రుత పరచడం తదితర అంశాలపై విశ్వహిందు పరిషత్ కృషి చేస్తుందని అన్నారు. చిన్నతనం నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలకు ధర్మం పట్ల, సంస్కృతి పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నర్సింగప్ప, వీహెచ్‌పీ మండలాధ్యక్షులు భీంరాజ్, ప్రచండ అధ్యక్షుడు వెంకటనారాయణ పాల్గొన్నారు.

సిద్ధలింగస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



మాగనూర్: మండల పరిధిలోని సిద్ధలింగమహాస్వామిని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగమహాస్వాముల వారు శుక్రవారంతో 21 రోజుల మౌన దీక్ష ముగించుకున్న సందర్భంగా స్వామివారిని శాలువాతో సన్మానించారు. స్వామివారి ఆధ్వర్యంలో మఠం దిన దిన అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన మఠం మరింత అభివృద్ధి చెంది భక్తులకు ఆధ్యాత్మికంగా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, నర్సింహరెడ్డి, ఈశ్వర్‌యాదవ్, ఎల్లలింగ తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభలను జయప్రదం చేయాలి

ఆత్మకూర్: అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, జిల్లా కార్యదర్శి వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆత్మకూర్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి మహాసభలకు రైతులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు కుర్మన్న, వెంకటన్న, మల్లేష్, సల్వారెడ్డి, లింగన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.